క్లుప్తంగా

సేవాభావంతో పనిచేయండి

నారాయణఖేడ్: అంబేడ్కర్, పూలే సేవాసమితి సభ్యులు సేవాభావంతో పనిచేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం అన్నారు. ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పండరి అధ్యక్షతన గురువారం కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసి సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. త్వరలోనే నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పండరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఔదార్యం


రక్తదానం చేస్తున్న యాదగిరి

నారాయణఖేడ్: ఓ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం ఉండటంతో నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ గ్రూపు సభ్యుడు తన రక్తాన్ని దానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఓ మహిళకు ప్రసవ నిమిత్తం అత్యవసరంగా బి పాజిటివ్ గ్రూపు రక్తం అవసరం ఉందని వైద్యులు సూచించారు. కానీ ఆ గ్రూపు రక్తం అందుబాటులో లేకపోవడంతో మహిళ కుటుంబీకులు ఖేడ్ బ్లడ్ డోనర్స్ గ్రూపు సహకారాన్ని కోరారు. దీంతో స్పందించిన అదే గ్రూపు రక్తం కలిగిన గ్రూపు సభ్యుడైన నిజాంపేట మండల కేంద్రానికి చెందిన వడ్ల యాదగిరి తన సొంత ఖర్చులతో గురువారం ఆస్పత్రికి వెళ్లి రక్తాన్ని దానం చేశారు.

వ్యక్తి అదృశ్యం


అనిల్‌కుమార్

జహీరాబాద్: పట్టణంలోని మేస్త్రి కాలనీలో నివాసం ఉంటున్న మర్పల్లి అనిల్‌కుమార్ అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండల పరిధిలోని మైడిగుమ్మల్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ కొంతకాలంగా మేస్త్రి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అనిల్‌కుమార్ ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య సురేఖ జహీరాబాద్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మహిళ...


జ్యోతి

సంగారెడ్డి అర్బన్: పుల్‌కల్ మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన వడ్డే జ్యోతి కూలిపని నిమిత్తం సంగారెడ్డి పట్టణానికి ఈ నెల 15వ తేదీన వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి రాములు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712581137 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

భూ సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ నాయకులు సతీష్, అరుణ్, బస్వరాజ్‌పాటిల్, అంబేడ్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర ప్రారంభం

మనూరు(నారాయణఖేడ్): బెల్లాపూర్‌లోని ప్రసిద్ధి చెందిన దత్తగిరి మహారాజ్ ఆశ్రమం నుంచి బర్దీపూర్ వరకు నిర్వహించే పాదయాత్ర పల్లకీ సేవా కార్యక్రమం గురువారం బెల్లాపూర్ నుంచి ప్రారంభమైంది. కార్యక్రమంలో దత్తాత్రేయ మాలాధారులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలకు నిలయం.. బ్రిడ్జ్ స్కూల్

- మౌలిక వసతులు కరువు
- మూత్ర విసర్జనకు ఆరుబయటికే
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ఆర్‌బీఎస్ పాఠశాల


అపరిశుభ్రంగా తాగునీటి కుళాయిలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గల ప్రభుత్వ రెసిడెన్షియల్ బ్రిడ్జ్ స్కూల్ (ఆర్‌బీఎస్)లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. విద్యార్థుల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2017లో తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ స్కూల్‌ను బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాలలోని పలు గదుల్లో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో 32 మంది విద్యార్థులతో పాఠశాల ప్రారంభమైంది. ప్రస్తుతం 90 మంది విద్యార్థులు చదువుతుండగా 4వ తరగతి నుంచి 8వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. కానీ విద్యార్థులకు సరిపడా మౌలిక సదుపాయలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు మూత్ర విసర్జనకి ఆరు బయటకు వెళ్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోని మంచి నీరు తాగే కుళాయిల వద్దనే స్నానం చేస్తున్నారు. దీంతో అక్కడ అపరిశుభ్రంగా మారి అంటు రోగాలకు సోకుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీఎస్ పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదుల కొరత

జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కొన్ని తరగతి గదులు ఆర్‌బీఎస్ పాఠశాలకు కేటాయించారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు లేక ఆరు బయటనే పాఠాలు చెబుతున్నారు. తాగునీటి సమస్య కూడా ఏర్పడుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు చర్మ వ్యాధులు

ఆర్‌బీఎస్ పాఠశాలలోని పలువురి విద్యార్థులకు చర్మ వ్యాధి సోకడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మొదట ఒక విద్యార్థికి సోకి తర్వాత మరి కొంత మందికి ఆ వ్యాధి వ్యాపించింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో స్థానికం చర్చనీయాంశంగా మారింది.

వైద్య సేవలు అందించాం



పాఠశాలలోని ఓ విద్యార్థికి గజ్జి చర్మ వ్యాధి సోకిన మాట వాస్తవమే. అతడికి మందులు అందించి ఇంటికి పంపించాం. నలుగురికి వ్యాపించింది. వారికి వెంటనే వైద్యసేవలు అందించాం. పాఠశాల వద్దకే వైద్య బృందం వచ్చి అందర్నీ పరీక్షించింది. పాఠశాలలోని సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– లక్ష్మణ్‌గౌడ్, ప్రత్యేక అధికారి, ఆర్‌బీఎస్ పాఠశాల

తాగునీటి సమస్యలు రావొద్దు

సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ రాములు


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాములు

జహీరాబాద్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ రాములు అన్నారు. జహీరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఉద్యానవన అధికారి శైలజ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చే రైతులకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ అందిస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ ఎన్ని ఎకరాల్లో సాగుచేసినా సబ్సిడీ వస్తుందన్నారు. డ్రిప్‌కు మాత్రం 12 ఎకరాల వరకే సబ్సిడీ ఉంటుందని వివరించారు. శేఖాపూర్ నుంచి తాండూర్ వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ నర్సింహులు అన్నారు. చిరాగ్‌పల్లి నుంచి మన్నాపూర్ వరకు బీటీ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని డీఈ నర్సింహులు తెలిపారు. మల్‌చల్మ, మొగుడంపల్లి వైద్యులు సీతారామరాజు, నవనీత్ మాట్లాడుతూ వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాంతులు, విరేచనాలైతే గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిశెట్టి, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, సత్వార్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 2కే రన్



2కే రన్ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

నారాయణఖేడ్: భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం నారాయణఖేడ్‌లో విద్యార్థులు 2కే రన్ నిర్వహించారు. పట్టణ శివారులోని పంచగామ కమాన్ నుంచి పట్టణంలోని రాజీవ్ చౌక్ వరకు రన్ కొనసాగింది. కార్యక్రమంలో ఆ సంఘ మాజీ జిల్లా అధ్యక్షుడు అరుణ్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, డివిజన్ నాయకులు అనిల్‌రెడ్డి, రాజు, కార్తీక్, సంతోష్, అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.


మహబూబ్‌సాగర్ చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

గుర్రపు డెక్క తొలగింపు

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపును అధికారులు ప్రారంభించారు. చెరువులో గుర్రపు డెక్క పెరగడంతో చేపలు పట్టేందుకు ఇబ్బంది పడుతున్నామని మత్స్యకారులు ఇటీవల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన హెచ్‌ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం చేపట్టారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నగేష్, నరసింహారాజు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: హోటల్, కల్లు దుకాణాల్లో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటలోని హోటల్‌లో రాజు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందింది. దీంతో ఘటనాస్థలానికి చేరుకొని అతడి వద్ద నుంచి 7 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సుల్తాన్‌పూర్‌లోని కల్లు దుకాణంలో గండిగూడెంకు చెందిన భాస్కర్ వద్ద 6 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో...

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ లేబర్ క్యాంపులో మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాకేష్‌కుమార్ సింగ్ అనే వ్యక్తి ఉస్మాన్‌నగర్ ప్రాంతంలోని అపర్ణ లేబర్ క్యాంప్ వద్ద గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దుకాణంపై దాడి చేసి 6.3 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఇబ్బంది రాకుండా చర్యలు

శివ్వంపేట(నర్సాపూర్): వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీఓ తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలోని పలు కాలనీల్లో నీటి పైపులైన్‌లు దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం ఎంపీఓ వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు.


పైప్‌లైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న ఎంపీఓ

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి అర్బన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మహిళల భద్రత.. పౌష్టిక ఆహారం అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శశికర్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తుండటం సంతోషకరమన్నారు. మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గాయత్రి, హెల్త్ సూపర్‌వైజర్ కరుణకుమారి, కమ్యూనిటీ ఆర్గనైజర్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరగటంతో ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో గురువారం చోటుచేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టాండర్డ్ గ్లాస్ పరిశ్రమలో రియాక్టర్‌ను తయారు చేస్తున్న సమయంలో భారీ స్టీల్ పరికరం అదుపు తప్పి కింద పడింది. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఫాజిల్ అనే కార్మికుడి చేతికి తీవ్రమైన గాయమైంది. తోటి కార్మికులు స్పందించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమలో సరైన సెఫ్టీ పరికరాలు లేవని, అంబులెన్స్ వాహనం కూడా అందుబాటులో లేదన్నారు. కార్మికుడిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు పరిశ్రమను సందర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నట్లు కార్మికులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడాలి


ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ పొందే విధంగా కృషి చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూ దానికి అనుగుణంగా కష్ట పడాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చింతకింది కాశీం సూచించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం విశ్వభారతి లా కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాశీం హాజరై లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ, అధ్యాపకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జూనియర్లు, సీనియర్లు తేడా లేకుండా అందరూ కలిసి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యువతీ,యువకులు ర్యాంపు పై వాక్ చేశారు. లా కళాశాల అధ్యాపకులు వర్ష, రమ్య, కీర్తి, అన్వి, పూనం, తేజశ్రీ, గురుమూర్తి, అంబర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన చిలప్‌చెడ్ పోలీస్టేషన్‌ను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదు తరలించేవారు సంబంధిత పత్రాలు వెంట తీసుకెళ్లాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎస్‌ఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఉన్నారు.

పెట్రోల్ ఉన్నా.. నో స్టాక్ బోర్డు


పెట్రోల్ బంకు ముందు నో స్టాక్ బోర్డు పెట్టిన దృశ్యం

రామచంద్రాపురం (పటాన్ చెరు) : బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్‌లోని కన్స్యూమర్ పెట్రోల్ బంక్‌ను వారం రోజులుగా యాజమాన్యం మూసి వేయడంతో వాహనదారులు, బీహెచ్‌ఈఎల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోక్ సభ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ పెట్రోల్ పై రూ.2 ధరను తగ్గించింది. కానీ బంక్ యాజమాన్యం పెట్రోల్‌ను ముందుగానే కొనుగోలు చేసింది. ఈ పెట్రోల్‌ను ప్రస్తుత ధరకు అమ్మితే నష్టం వస్తుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పట్లో పెట్రోల్ ధర పెరిగే అవకాశం లేదు. కోడ్ ముగిసే దాకా పెట్రోల్ బంక్ తెరుస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీలో చేరిక

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్‌ఎస్ సీనియర్ మండల నాయకుడు బస్వరాజ్ పాటిల్ బీజేపీలో చేరారు. మండల పరిధిలోని మెరియంపూర్ గ్రామానికి చెందిన బస్వరాజ్‌పాటిల్ చాలా కాలం పాటు టీడీపీలో పనిచేశారు. బీఆర్‌ఎస్ ఆవిర్భవించిన అనంతరం ఆ పార్టీలో చేరారు. తాజాగా జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సమక్షంలో గురువారం బీజేపీలో చేరారు.

◆ అన్నదానం

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని సంగుపేట సమీపంలోని మూడు గుంటల హనుమాన్ దేవాలయంలో గురువారం సప్తహ ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోగిపేట విద్యుత్‌శాఖ డిఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు పూజల్లో సబ్ ఇంజనీర్ పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

◆ నియామకం

న్యాల్‌కల్(జహీరాబాద్): బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా బిజిలీపూర్ శ్రీకాంత్ నియమితులయ్యారు. శ్రీకాంత్ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. అతని సేవలను గుర్తించిన నాయకులు ఆయనను బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు.

◆ పోషక విలువలపై అవగాహన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అత్నూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు చిరుధాన్యాల్లో లభించే పోషకాలపై అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశావర్కర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ పట్టా భూముల్లో మార్పులు చేయొద్దు

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ బండ్లగూడ ఎన్నికకు పర్స్ ఇన్ చార్జ్ ద్వారా ప్రారంభించబడిందని రెవెన్యూ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త సభ్యుల ఎన్నిక పూర్తి అయ్యేంతవరకు పటాన్ చెరువు, అమీన్‌పూర్, రామచంద్రాపురం పరిధిలోని పట్టా భూముల్లో ఎలాంటి మార్పులు చేయొద్దన్నారు.

◆ మంత్రిని కలిసిన అయ్యప్ప భక్తులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ పునః ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరు కావాలని కోరుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించనున్నారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారి సాగర్ పాల్గొన్నారు.

◆ బీబీ పాటిల్ గెలుపునకు కృషి చేయాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్, మండల ఇన్‌చార్జి జగనాథ్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని గంగ్వార్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మల్లేష్, ఉషల్ రాయ్, సంతోష్ పాటిల్, నాగిశెట్టి, దిలీప్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డి, వీరన్న, అరవింద్ చౌహన్ పాల్గొన్నారు.

◆ లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి

జహీరాబాద్ టౌన్: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేయాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జహీరాబాద్ అధ్యక్షుడు జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలో 1400 మంది పెన్షనర్లు ఉన్నారని, ఇప్పటివరకు 1060 మంది లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారని చెప్పారు. మిగిలిన వారు ఈ నెలాఖరు లోపు జనన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. కొంతమంది ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు సమర్పించారన్నారు. అయితే ఫోటోలు మ్యాచ్ కాకపోవడంతో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మిగిలిన వారు స్థానిక ఏటీఓ లేదా ఎస్‌టీఓలను సంప్రదించి లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని సూచించారు.

◆ భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ భవానీమాత ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ ఘనంగా ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి ఎల్లమ్మ ఆలయ 7వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఎల్లమ్మ జమదగ్ని కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు రాజేశ్వర్, సుశీల్ కుమార్, పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

◆ అంబులెన్స్‌ల తొలగింపు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కొన్నేళ్లుగా ఉన్న 30 అంబులెన్స్ వాహనాలను నిలిపి ఉంచడం వలన అక్కడే ఉన్న బస్ స్టాప్ వినియోగానికి నోచుకోవడంలేదు. దీంతో పట్టణ టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ చొరవ చూపి అంబులెన్స్ యజమానులను గురువారం పిలిపించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడి ఆ ప్రదేశం నుంచి అంబులెన్స్‌లను తీయించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సహకారంతో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు.